కథానిక

# ఏకాకి

—జి. లక్ష్మి

"కలకాలం నిలిచే కథలన్నీ జీవితంలోంచి. అనుభవాల్లోంచి పుట్టినవే. అందుకే వాటిని సృష్టించిన కళాస్రష్టలంతా సాహిత్యం ఉన్నంతకాలం జీవించే ఉంటారు. ఇప్పుడొచ్చే కథలన్నీ డబ్బు కథలు. కాదంటే వ్యాపారం కథలు. ఇంకా నిజమైన కళ ఎక్కడ జీవించి ఉందండి బాబూ? దాన్నెప్పుడో నిలువెత్తు లోతున పాతి పెట్టేశాం. ఇపుడు బాగా రాయగలిగిన వాళ్లు రాయరు. రాయరాని వాళ్లు టన్నుల కొద్దీ వండుతారు. ఇదీ పరిస్థితి"

కొద్దిపాటి ఆవేదన కలిపిన ఆవేశంతో సాగిపోయే అనంతశాస్త్రి గారి వాక్ప్రవాహం శ్రోతలకు అలవాటు. అందుకే ఎక్కడ ఆయన సభలు జరుగుతున్నా నేను తప్పక హాజరవుతుంటాను. సాహిత్యం మీద ఆయనకున్న గురి, లోతుల్ని తరచి చూసిన ఆయన మేధ, జ్ఞాన సముపార్జనకు అడ్డురాని ఆయన ముదిమి నాకు ఎప్పటికప్పుడు ఉత్సాహాన్ని అందిస్తూ ఉండేవి, నాలోని కళాస్రష్టకు ఊపిరి పోసేవి.

ఆయన ఇప్పుడిచ్చిన ఉపన్యాసం విని మాత్రం నాకు కొద్దిపాటి సిగ్గేసింది. ఎంతయినా నేనో వర్ధమాన రచయితనయ్యే. రాశి తక్కువైనా వాసి బాగుంటుందని కొద్దోగొప్పో పేరు తెచ్చుకుంటున్నవాణ్ణి. పైగా రేపోమాపో నా కథల బొత్తి పట్టుకుని అనంతశాస్త్రిగారి "అనంతం" వారపత్రిక మీద దండెత్తాలని బృహత్ప్రణాళికలు వేస్తున్నవాణ్ణి. మరి ఇలాంటి నేపథ్యంలో కథల మీదా, కొత్తగా కథలు రాస్తున్నవాళ్ళ మీదా ఆయన ఎడాపెడా వేసిన బాదుళ్ళు నాకు తగలకుండా ఉండవు కదా. అందుకే కథలు అలా ఉండడం నా సొంతబాధ్యతన్నట్టు, అది నా ఒక్కడికే తప్పేనన్నట్టు ఆ కాసేపూ తల భూమిలోకి వంచేసుకుని కూర్చున్నాను.

దానితో నా కథలు పట్టుకుని "అనంతం" కార్యాలయం మీద నేను చేద్దామనుకున్న దాడి నిరవధికంగా వాయిదా పడింది. ఓ గొప్ప"మాస్టర్ పీస్"అంటూ కళాఖండాన్ని సృష్టించే వరకూ గురువుగారి మొగం చూడకూడదనుకుని భీష్మ ప్రతిజ్ఞ చేసేసుకున్నాను.

మాస్టర్ పీస్ నా మనసుని ఇలా తినేస్తుండగానే ఓ రోజు సురేంద్రబాబు ఊడిపడ్డాడు. వాడు నా చిన్నప్పటి స్నేహితుడు. వాడికి క్రైమ్, సస్పెన్స్ (థ్రిల్లర్) అంటే తగని పిచ్చి. జట్టలు బుట్టలు రాయగలడు. అలాంటి సూరిగాడు నాదగ్గరకు ఎందుకు వచ్చినట్లు? కొంపదీసి ఎవరికయినా రికమెండ్ చేయమని కాదు గదా! అనుకున్నాను. నా సందేహాన్ని వాడే తీర్చేశాడు.

"ఒరేయ్ మూర్తీ! అనంతశాస్త్రి దగ్గరకు వెళదాం వస్తావుటోయ్!" అడిగాడు వాడు.

"అనంతశాస్త్రి గారా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఊ! ఓ నవల ఇవ్వాలి" అన్నాడు వాడు తాపీగా.

వాడి ధైర్యానికి నాకు వళ్లు మండింది. ఆ దరిద్రపు గొట్టు నవలని ఏ మొహంతో ఆ సాహిత్యమూర్తి ఎదుటకు పట్టుకు పోతాడని- ఆ భావాన్నే పరోక్షంగా వాడికి చెప్పాను. దానికి వాడు అదోలా నవ్వాడు. నవ్వి,

"వస్తున్నావా? రావా?" అన్నాడు.

అలా ఎవరన్నా తెగించి అడిగితే నాకు నోట మాటరాదు. అందుకే మౌనంగా వాడిని అనుసరించాను?

దారి పొడుగూతా నా బుర్ర నన్ను తినేస్తూనే ఉంది. కొద్దో, గొప్పో మంచి కథలు రాసిన నేనే వెళ్ళడానికి ధైర్యం చాలక ఆగిపోయాను. ఈ క్రైమ్ థ్రిల్లర్ గాడి మొగమన్నా చూస్తాడా ఆయన? అనుకుని నవ్వుకున్నాను.

మేం వెళ్ళేటప్పటికి అనంతశాస్త్రి గారు పత్రికాఫీస్‌లోనే ఉన్నారు. వెళ్ళగానే సూరిగాడు తనకు తాను పరిచయం చేసుకున్నాడు.

ఆయన "అలాగా" అని ఊరుకున్నారు. కనీసం నవ్వనుకూడా నవ్వలేదు. కూర్చోమని కూడా అనలేదు. నాకు మనసులో బోలెడు సంతోషం వేసింది.

"తుప్పు వదిలింది వెధవకి" అనుకున్నాను కసిగా. సూరిగాడు హఠాత్తుగా జేబులోంచి ఏదో కాగితం తీసి ఆయన కిచ్చాడు. రికమెండేషన్ లెటరని నాకు అర్థమైపోయింది.

లెటర్ ఆసాంతం చదవకుండానే అనంతశాస్త్రిగారు మా ఇద్దరికీ సీటు ఆఫర్ చేశారు. మూడొంతులు చదివి సూరిబాబొంక తిరిగి చిరునవ్వు చిలికించారు.

అంతా పూర్తి చేసి "అయితే అదన్నమాట సంగతి" అన్నారు. తర్వాత ఒక్క నిముషం ఆలోచిస్తూ ఉండిపోయారు. తర్వాత నావైపు అనుమానంగా చూచారు. సూరిబాబు కూడా కళ్ళతోనే ఫరవా లేదన్నట్టు చూసాడు. ఆయన "కాఫీ" తెమ్మని బోయ్‌ని పిలిచాడు.

"అయితే నవల తెచ్చారన్నమాట" అన్నారు నిగూఢంగా చూస్తూ.

మావాడు తాను రాసిన "హత్యా కేళి" ని బైటపెట్టాడు.

దాన్ని ఆయన మావాడి ముఖానికేసి కొడతాడని నేను ఆత్రంగా ముందుకి వంగాను.

కానీ ఆయన మరోసారి చిరునవ్వు నవ్వి "ఓ. కే. అంతా అలాగే. అవునా?" అన్నారు.

"అంతే. అంతే." అన్నాడు సూరిబాబు.

"అయితే వేసేసినట్టే" అన్నారు అనంతశాస్త్రి గారు.

మావాడి మొగం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోయింది.

నాకయితే ఏదో విఠలాచార్య సినిమా చూస్తున్నట్టుంది కానీ ఒక్క ముక్క అర్థం కాలేదు. నా అవస్థ చూసి సూరిగాడు నవ్వుకుంటున్నాడనే అనుమానం ఒకటి.

తర్వాత ఇద్దరం బైటపడ్డాం. దారిలో భూతాళ రహస్యం విప్పాడు సూరిగాడు. ఈ నవల వ్రాసుకుంటున్నందుకు ఆయనకు తాను ఐదు వేల రూపాయలు ఇస్తున్నాట్ట. వేయి తిరిగిన ఓ థ్రిల్లర్ రచయిత సూరిగాడికి ఈ పలహా చెప్పాడట ఆ ఎడిటర్ తనను "డిస్కవర్" చేసి "పుష్" ఇచ్చినట్టు, కాకపోతే ఒకటి రెండు

నవలల పారితోషికం ఎదురు ఇచ్చుతుంటే సూరిగాడిని కూడా "పుష్" చేస్తాడని చెప్పారట. అని రికమెండేషన్ లెటర్ కూడా ఇచ్చారట. నాకు ఒక్కసారి అయోమయంగా అన్పించింది.

"అదేంటి ? ఆయనకు మీరు డబ్బు ఇవ్వడం ఎందుకు ? పుష్ చేయడం ఏమిటి? దానివల్ల వచ్చే లాభం?" అన్నాను వింతగా.

వాడొక్కసారి వి(క్రమార్కుడిలా విరగబడి నవ్వాడు.

"పిచ్చివాడా ! ఆయన నా నవల ఒట్టినే వేసి ఊరుకోడు. ఇంతటివాడు, అంతటివాడు అని పేజీలకు పేజీలు పబ్లిసిటీ ఇస్తాడు, దానితో మిగిలిన ప(త్రికలకు మన పత్తా తెలుస్తుంది. ఇక్కడ ఒక్క నవల డబ్బు వదులుతుంటే ఈ పేరుతో రేపు మరో పది నవలలకు గిరాకీ తెచ్చుకోవచ్చు. అదృష్టం కాలి ఏ సినిమా నిర్మాతో ఓ నవల కావాలన్నాడంటే ఇక చూస్కో మరి. ఐదు వేలు పెట్టుబడి కెంత లాభమో !" అలుపు తీర్చుకోడానికి ఆగాడు సూరిగాడు. దెబ్బకి కళ్లు తిరిగి కింద పడ్డాన్నేను.

చదవండి చదివించండి

# శాంతి - స్నేహం

(తెలుగు మాస ప(త్రిక)

సంవత్సర చందా రూ. 20/-లు

318, అమృతా ఎస్టేట్స్, హిమయత్ నగర్, హైదరాబాదు-500 029.